## ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, జనవరి 30: ప్రతి ఓటరు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి ఓటర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈవీఎంలో ఓటు ఏవిధంగా వేయాలి, వేసిన ఓటును వీవీప్యాడ్‌లో ఏ విధంగా చూసుకోవాలనే అంశంపై అధికారులు ఓటర్లకు క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు డీటీ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జనవరి 30: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. మంగళవారం మోమిన్‌పేట మండలం పరిధిలోని కొత్త కోల్కుంద, పాత కోల్కుంద గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




పరిగిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న జిల్లా పశుసంవర్ధ శాఖ అధికారి అనిల్

పరిగి, జనవరి 30 : జంతు సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.అనిల్‌కుమార్, పరిగి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ అంకమరాజు, పరిగి మండల పశువైద్యాధికారి కె.రామకృష్ణ పేర్కొన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం పరిగిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీహెచ్‌ఎస్ నం.1 ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జంతుహింసకు పాల్పడకుండా, జంతువుల పట్ల కరుణతో ఉంటూ వాటి సంరక్షణ చేపట్టాలన్నారు. వన్యప్రాణులు కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వాటిని సురక్షితమైన అటవీ ప్రాంతానికి తరలించేందుకు సహకరించాలని సూచించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని చెప్పారు. తినుబండారాలు కలిగిన ప్లాస్టిక్ కవర్లను రోడ్డుపై, ఆరుబయట పడేయరాదని, జంతువులు ప్లాస్టిక్ కవర్లు, సంచులు తినడం వల్ల చనిపోయే ప్రమాదం ఉందన్నారు. జంతు సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ నెం.1 ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె పోస్టర్లు విడుదల చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

పరిగి, జనవరి 30 : పరిగి మండలం జాఫర్‌పల్లిలోని డబ్ల్యూటీపీ దగ్గర మిషన్ భగీరథ కార్మికులు ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికుల వేతనాల పెంపు, జీవో నం.11 అమలు తదితర పెండింగ్ అంశాలు పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథలో జిల్లా వ్యాప్తంగా 400 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి 16వ న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రమేశ్, బి.రమేశ్, శ్రీకాంత్, అఫ్సర్, ఫిరోజ్, నరేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల కృషితోనే గ్రామాల అభివృద్ధి



రంగాపూర్ సర్పంచ్ లక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీపీ అరవిందరావు

పరిగి, జనవరి 30 : సర్పంచ్‌ల కృషితో గ్రామాలు అభివృద్ధి చెందాయని పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు తెలిపారు. మంగళవారం పరిగి మండలం రంగాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేసి సర్పంచ్ లక్ష్మి, వార్డుసభ్యులను ఎంపీపీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన పల్లె ప్రగతితో గ్రామాలు శుభ్రంగా, పచ్చదనంతో అందంగా తయారయ్యాయని తెలిపారు. గతంలో ఏ గ్రామానికి వెళ్లినా పెంటకుప్పలు దర్శనమిచ్చేవని, నేడు గ్రామాలన్నీ చాలా సుందరంగా మారాయని చెప్పారు. మొక్కల పెంపకంతో పచ్చదనం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో దయానంద్, పంచాయతీ కార్యదర్శి విశ్వతేజ, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

# గ్రామాలను అభివృద్ధి చేస్తా

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 30 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పరిగి మండలంలోని రుక్కుంపల్లిలో నూతనంగా నిర్మాణం చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు పూడూరు మండలం మిట్టకంకల్‌లో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎంపీపీ కరణం అరవిందరావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, పూడూరు పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆర్.శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రుక్కుంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

### విద్యార్థులు లక్ష్యసాధనకోసం కృషిచేయాలి

కులకచర్ల, జనవరి 30 : విద్యార్థులు తమ లక్ష్యసాధనకోసం కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాడల్ స్కూల్ విద్యార్థులకు మేముసైతం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యను కష్టంతో కాకుండా ఇష్టంతో అభ్యసించాలని సూచించారు. సంస్కారంతో కూడిన విద్యను నేర్చిన నాడే అది జీవితంలో చాలా ఉపయోగపడుతుందన్నారు. సత్ప్రవర్తనతో విద్యార్థులు సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మేముసైతం నిర్వాహకులు పూడూరు మండలం రాకంచర్ల సర్పంచ్ వెంకయ్య, మోటివేషన్ స్పీకర్ సేవక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి బాల్యదశ చాలా విలువైనదని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ చంద్రభూపాల్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, కులకచర్ల ఎంపీటీసీ ఆనందం, నాయకులు మొగులయ్య, గోపాల్‌నాయక్, చంద్రయ్య, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



సర్పంచ్ రాజప్పను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్, జనవరి 30 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని తాండూరు జడ్పీటీసీ గౌడి మంజుల అన్నారు. మంగళవారం గౌతాపూర్ సర్పంచ్ రాజప్పతోపాటు వార్డు సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధించాయని.. హరితహారం కార్యక్రమంతో గ్రామాలు పచ్చదనంతో నిండిపోయాయన్నారు. సర్పంచ్‌లు ఐదేండ్లకాలంలో తమ పదవులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డులు వచ్చాయన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ స్వరూపావెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, డీఎల్‌పీవో శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలని పేర్కొన్నారు. సర్పంచ్ రాజప్ప మాట్లాడుతూ తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాములు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో ధారూరు ముందుంటుంది

ధారూరు, జనవరి 30: అభివృద్ధి పనుల్లో మండలం ముందుంటుందని.. అధికారులు క్రమ శిక్షణతో పనిచేస్తారని వికారాబాద్ జిల్లా ట్రైనీ(అసిస్టెంట్) కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా వచ్చినప్పుడు మండలం ఎలా ఉంటుందోనని అనుకున్నానని.. కానీ..మండలంలో పని చేసే అధికారులకు క్రమశిక్షణతో కలిసిమెలిసి పనిచేసే గుణం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లో నిర్వహించే పనులను పరిశీలించానని, మండల అధికారుల నుంచి చాలా విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. మోమిన్‌కలాన్, గురుదొట్ల, స్టేషన్ ధారూరు, గ్రామాల్లో పర్యటించి నర్సరీలు, పల్లెప్రకృతివనాలను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీడీవో చెన్నారెడ్డి, ఎంపీవో షఫిఉల్లా, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏపీవో సురేశ్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.



అమిత్ నారాయణ్‌కు సన్మానం చేస్తున్న ఎంపీడీవో, ఎంఆర్‌వో, తదితరులు

## మహాత్మాగాంధీకి ఘన నివాళి



మౌనం పాటిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తదితరులు

వికారాబాద్, జనవరి 30 : భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను అర్పించి అమరులుగా నిలిచారని, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, భావి తరాలకు తెలియపరచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాల యం సమావేశ మందిరంలో అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనాన్ని పాటించారు. జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట:** మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, కాశీపతి, లక్ష్మీ, శ్రీప్రియ, గోపాల్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమరవీరుల సంస్మరణార్థం విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**పెద్దేముల్:** భారతావనికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని ప్రసాదించిన మహనీయుడు గాంధీజీ అని పెద్దేముల్ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది ఎల్లారెడ్డి, రియాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, ఎర్రబాలప్ప, విద్యాసాగర్, ఫయాజ్, వెంకటేశం, గోపాల్, పెంటప్ప, రవీందర్ పాల్గొన్నారు.

**కులకచర్ల :** కులకచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సర్పంచ్ సౌమ్యావెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి స్థానికులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వెంకటేశ్, మాజీ ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, సురేశ్, రమేశ్ పాల్గొన్నారు. అలాగే చౌడాపూర్ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి గ్రామ, మండల నాయకులు నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, మండల ప్రెసిడెంట్ సలీం, వెంకటేశ్, చిన్నయ్య, రమేశ్, గోపాల్, నర్సింహులు, పాండు, శంకర్, గౌరీ, రాజు, మల్లేశ్, బుచ్చయ్య, మణికంఠ, శ్రీను, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హక్కులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

దోమ, జనవరి 30 : పౌరుల హక్కులను ఎవరూ ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. మండలంలోని అయినాపూర్‌లో మంగళవారం సివిల్ రైట్స్ డేలో భాగంగా గ్రామంలోని ఎస్సీవాడలో గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పౌరుల ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా సాంఘిక దురా చారాలు, అంటరానితనం, బాల్యవివాహాలు, రెండు గ్లాసుల పద్ధతి, ఎస్సీ, ఎస్టీ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా రోడ్డు భద్రతలో భాగంగా వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర విషయాలపై గ్రామస్తులకు వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యానారాయణ చారి, ఆర్‌ఐ సుదర్శన్, హాస్టల్ వార్డెన్ శంకర్ పాల్గొన్నారు.

**పెద్దేముల్:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రెండు గ్లాసుల పద్ధతిని రూపుమాపుకొని కలిసి మెలసి జీవనాన్ని కొనసాగించాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజురెడ్డి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బండపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల మధ్య ఎవ్వరు కూడా కులవివక్ష చూపించరాదని, రెండు గ్లాసుల పద్ధతిని రూపుమాపాలన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.


**కొడంగల్:** హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని సర్పంచ్ అనితాపకీరప్ప పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అన్నారం గ్రామంలో సర్పంచ్ అధ్యక్షత పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఎస్‌ఐ బాల్‌కిషన్ మాట్లాడుతూ చట్ట పరిధిలో నడుచుకుంటే ఆనంద జీవనం కొనసాగుతుందన్నారు.



దోమ: అయినాపూర్‌లో పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**మర్పల్లి:** పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శ్రీధర్‌రెడ్డి అన్నారు.. మంగళవారం మండలంలోని బిల్‌కల్ గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎస్సై పాల్గొని మాట్లాడుతూ 18 ఏండ్లు నిండకుండా వివాహాలు చేయరాదని, చిన్నపిల్లలను పనులకు పంపించకుండా బడికి పంపాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మాధవరెడ్డి, హాస్టల్ వార్డెన్ తుల్జారమ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాంచందర్ గ్రామస్తులు పాల్గొన్నారు..

**తాండూరు రూరల్:** పౌరహక్కులకు ఎవరూ భంగం కల్పించరాదని తాండూరు మండలం, కరణ్‌కోట ఎస్సై మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్ గ్రామం లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



కొడంగల్, జనవరి 30: మండలంలోని టేకల్‌కోడ్ గ్రామంలో సర్పంచ్ గుండప్పతో పాటు వార్డు సభ్యులను మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. బుధవారం నుంచి వీరి పదవీ కాలం ముగియనుండడంతో సన్మానించి అభినందించారు.


## గుట్కా, మత్తు పదార్థాలు అమ్మిన వ్యక్తుల పై కేసు

వికారాబాద్, జనవరి 30 : వికారాబాద్ పట్టణంలో మధ్యాహ్నం సీఐ టంగుటూరి శ్రీను సిబ్బందితో కలిసి పట్టణంలో గల వివిధ పాన్ షాపులు, దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాన్‌షాప్ యజమానులైన సయ్యద్ మహబూబ్, షఫీ ఉల్లాలు వద్ద నిషేధిత గుట్కా, మత్తు పదార్థాలు తాగుటకు ఉపయోగించే ఎంసీ, ఓఆర్‌సీ పేపర్లు, నిషేధిత సిగరెట్లు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం

ధారూరు, జనవరి 30: మండల పరిధిలోని మైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ బాబ్యానాయక్, ఉపసర్పంచ్ వెంకటయ్యలతో కలిసి ధారూరు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధారూరు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీడీవో చెన్నారెడ్డి, ఎంపీవో షఫిఉల్లా,పంచాయతీ కార్యదర్శి మమత, నాయకులు హన్మంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, యాదయ్య, రవికుమార్, యూనుస్, ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ తదితరులు ఉన్నారు.

## ఈ-కేవైసీ ప్రక్రియను బాధ్యతగా పూర్తిచేయాలి



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

పెద్దేముల్, జనవరి 30: రేషన్‌కార్డు కలిగిన వారు ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ-కేవైసీ ప్రక్రియను ఆయా గ్రామాల డీలర్లు పూర్తిచేయాలని మండల తహసీల్దార్ కే.కిషన్ అన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల డీలర్లతో సమావేశమై పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కె.కిషన్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు రేషన్ సరుకుల పంపిణీ చేసే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా సమయపాలన పాటించాలని, నిర్దేశించిన తేదీల ప్రకారం వినియోగదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను తప్పకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. మండలంలో మొత్తం 29 డీలర్ షాప్‌లు 29 మంది డీలర్లు ఉన్నారని, ఇంకా మూడు డీలర్ షాప్‌లు ఆత్కూర్, గోపాల్‌పూర్, ఖానాపూర్‌లలో డీలర్లు లేరన్నారు. గ్రామాల్లో రేషన్ డీలర్లు రేషన్ విని యోగదారుల వేలిముద్రలను సేకరించి ఈ-కేవైసీ ప్రక్రియను ఫిబ్రవరి 28 వ తేదీవరకు బాధ్యత పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజురెడ్డి, ఆయా గ్రామాల రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ ఎస్సై పై బదిలీ వేటు

వికారాబాద్, జనవరి 30: వికారాబాద్ ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వర్‌రావుపై ఆ శాఖ ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వికారాబాద్ మండలం గోధుమగూడ గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్ విచిక రిసార్ట్‌లో కొన్ని రోజుల క్రితం ఎక్సైజ్ ఎస్సై కోటే శ్వర్ రావు మాదకద్రవ్యాల సరఫరా జరుగుతుందంటూ తనిఖీలు చేశారు. రిసార్ట్ గదుల్లో తనిఖీల పేరుతో పర్యాటకులతో అమర్యాదగా ప్రవర్తించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన అధికారులు బదిలీవేటు వేసినట్లు తెలిపారు.

## విధుల్లో చేరిన ఎంపీడీవో

బొంరాస్‌పేట, జనవరి30:రెండేళ్లుగా డిప్యూటేషన్‌పై వెళ్లిన బొంరాస్‌పేట ఎంపీ డీవో శ్రీదేవి మంగళవారం తిరిగి ఎంపీడీ వోగా బాధ్యతలు స్వీకరించారు. 2022 ఫిబ్రవరిలో ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన శ్రీదేవి రెండు నెలలు పనిచేసి హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. అక్కడ రెండేళ్లుగా విధులు నిర్వహించిన ఆమె ప్రభుత్వం అధికారుల డిప్యూటేషన్లను రద్దు చేయడంతో తిగిరి బొంరాస్‌పేట ఎంపీడీవోగా విధుల్లో చేరారు.

## బీసీ కులాల ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఎన్నిక

తాండూరు రూరల్, జనవరి 30: బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా హరిదాస్‌పల్లి సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ అధ్యక్షుడు శెట్టిభాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మోహన్‌కృష్ణగౌడ్, టి. సంతోష్‌కుమార్, ఎం.రవికుమార్ యాదవ్, వెంక టేశ్ గౌడ్, విజయ్‌కుమార్ ముదిరాజ్, శెట్టి వీర్ బస్వప్ప, ప్రసాద్‌గౌడ్, చెన్‌వీరయ్యలను కూడా ఎన్నుకున్నారు.

## యూటీఎఫ్ కార్యవర్గం

బొంరాస్‌పేట, జనవరి 30 : ఐక్య ఉపా ధ్యాయ సంఘం బొంరాస్‌పేట మండల అధ్యక్షుడిగా గౌరారం గోపాల్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కార్య దర్శి మల్లేశ్ అధ్యక్షతన రేగడిమైలారంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నరేందర్ గౌడ్, కోశాధికారిగా నాగజ్యోతి, ఉపాధ్యక్షులుగా అలీమొద్దీన్, లక్ష్మి సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా రవికుమార్, సాం స్కృతిక కార్యదర్శిగా రహీం, కార్యదర్శు లుగా వెంకటయ్య, ఆనంద్‌రావు, అలవేలు, కేశవులు, సల్మా, సమాపర్వీన్‌లను ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి : 91827 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962